# పసిడి రుణాలకు డిమాండ్

- గత ఏడు నెలల్లో 50 శాతం వృద్ధి: ఆర్బీఐ

ముంబై, నవంబర్ 30: బంగారంపై రుణాలు తీసుకునేవారి సంఖ్య భారీగా పెరిగారు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పుడు, అత్యవసర అవసరాలకోసం బంగారమే పరమావధిగా కనిపిస్తున్నది. సామాన్యుడి నుంచి సంపన్నవర్గాల వరకు బంగారం ఉంటేచాలు బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇటీవలకాలంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ఈ రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థను కూడా నెలకొల్పాయి. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడిచిన ఏడు నెలల్లో(ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు) బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతం మేర పెరిగాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అక్టోబర్ 18, 2024 నాటికి పసిడి రుణాలు రూ.1,54,282 కోట్లుగా ఉన్నాయి. మార్చి 2024 నాటికి మొత్తం బంగారం రుణాలు రూ.1,02,562 కోట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైనదాంతో పోలిస్తే గోల్డ్ లోన్లు 56 శాతం అధికమయ్యాయి. గడిచిన ఏడు నెలల్లో బంగారం రుణాలు రాకెట్ వేగంతో దూసుకుపోయాయని, ఇందుకు ప్రధాన కారణం ఎన్బీఎఫ్సీ సంస్థలు అన్సెక్యూర్డ్ లోన్ల కంటే సెక్యూర్డ్ లోన్లపై ప్రత్యేక దృష్టి సారించడం వల్లనే పెరిగాయని బ్యాంకర్ వెల్లడించారు. అలాగే బంగారం ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోవడంతో రుణ గ్రహీతలు బంగారాన్ని తాకట్టుపెట్టుకొని ఇతర రుణాలను తీర్చుకుంటున్నారని తెలిపారు. పసిడి రుణాల పాలసీలు, విధానాల్లో లోపాలు ఉంటే వచ్చే మూడు నెలల్లో సరిదిద్దుకోవాలని గత నెలలో రిజర్వు బ్యాంక్ అన్ని బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలకు సూచించింది.



### గృహ రుణాలు కూడా..

బంగారం రుణాలతోపాటు గృహ రుణాలకు కూడా డిమాండ్ నెలకొన్నది. గత నెల చివరినాటికి దేశవ్యాప్తంగా రూ.28.7 లక్షల కోట్ల గృహ రుణాలు తీసుకున్నారు. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 12.1 శాతం పెరిగాయి. దీంతోపాటు క్రెడిట్ కార్డు ద్వారా తీసుకునే రుణాలు ఏడాది ప్రాతిపదికన 9.2 శాతం ఎగబాకి రూ.2.81 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఆన్లైన్ ద్వారా జరిపే లావాదేవీలు అధికంగా ఉండటం ఇందుకు కారణమని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది.

### వ్యక్తిగత రుణాలకు దూరం

బంగారం రుణాలతో పోలిస్తే వ్యక్తిగత రుణాలు తీసుకునేవారు తగ్గుముఖం పడుతున్నారు. ముఖ్యంగా ఈ రుణాలపై రిజర్వు బ్యాంక్ షరతులు విధించడంతో ఆర్థిక సంస్థలు, బ్యాంకులు ఇవ్వడానికి జంకుతున్నాయి. ఇటీవలకాలంలో దేశవ్యాప్తంగా వ్యక్తిగత రుణాలు మొండి బకాయిలు అధికంగా ఉండటంతో సెంట్రల్ బ్యాంక్ పలు కీలక చర్యలు తీసుకున్నది. దీంతో వ్యక్తిగత రుణాలు 3.3 శాతం తగ్గాయని తెలిపింది. మొత్తంమీద బ్యాంకింగ్ రుణాలు 4.9 శాతం అధికమై రూ.172.4 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

## ఆమ్నెస్టీ స్కీంకు ఈపీఎఫ్ గ్రీన్‌సిగ్నల్

- క్లెయిం సెటిల్‌మెంట్ తేదీ వరకు వడ్డీ చెల్లింపులు

న్యూఢిల్లీ, నవంబర్ 30: ఉద్యోగుల భవిష్యనిధి ఫండ్ ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయాలు తీసుకున్నది. ఈపీఎఫ్‌వో చందాదారుడికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించడానికి రూపొందించిన ఆమ్నెస్టీ స్కీంకు ఈపీఎఫ్‌వో పచ్చజెండా ఊపింది. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నది. ఈపీఎఫ్‌వో సెటిల్‌మెంట్ సమయంలో చేసే వడ్డీ చెల్లింపులను ఇకపై క్లెయిమ్ సెటిల్‌మెంట్ తేదీ వరకు చెల్లించాలని నిర్ణయించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం సెటిల్‌మెంట్ సమయంలో ఆ నెల 24వ తేదీ వరకు మాత్రమే వడ్డీ లెక్కించే విధానం ఉండగా.. ఇకపై సెటిల్‌మెంట్ తేదీ వరకు వడ్డీ చెల్లించనున్నారు. దీనివల్ల ఆర్థికంగా చందాదారుడికి ప్రయోజనం కలగడంతోపాటు ఫిర్యాదుల తగ్గుతాయని సీబీడీటీ అభిప్రాయపడింది. దీంతోపాటు ఈ స్కీం ప్రయోజనాలు పొందేందుకు యజమానులు నుంచి ఒక సాధారణ ఆన్‌లైన్ డిక్లరేషన్ సర్టిఫికేట్ తీసుకుంటే సరిపోతున్నదని తెలిపింది. దీంతోపాటు ఆర్థిక భారం నుంచి తప్పించుకోవడానికి ఉద్యోగ భవిష్యనిధి సంస్థతో రిజిస్టర్ కాకపోయిన ఉద్యోగుల నిధులను డిపాజిట్ చేయకుండా ఎగవేతలకు పాల్పడే సంస్థలకు క్షమాభిక్ష ప్రసాదించాలని నిర్ణయించింది. ఆయా సంస్థలు ఎలాంటి పెనాల్టీ ఎదుర్కొకుండా స్వచ్ఛందంగా ముందుకొచ్చి వివరాలు వెల్లడించే అవకాశాన్ని కల్పించింది. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో ప్రకటించిన ఎంప్లాయి డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీంనకు ఈ పథకం సహాయపడనున్నది. అలాగే ఎంప్లాయిస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్(ఈడీఎల్ఐ) స్కీంకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ స్కీం కింద చందాదారుడు మరణిస్తే రూ.2.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు బీమా పరిహారం లభించనున్నది.

### మళ్లీ ఈక్విటీలో పెట్టుబడులకు అనుమతి

మళ్లీ ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టడానికి ఈపీఎఫ్‌వో బాడీ అనుమతినిచ్చింది. గతంలో ఈక్విటీలో పెట్టుబడులను తిరిగి ఈక్విటీల్లో పెట్టుబడి ప్రతిపాదనలకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కనీసంగా ఐదేండ్లపాటు ఈ పెట్టుబడులు అలాగే ఉండాలని, ప్రభుత్వ సెక్యూరిటీలు, సీపీఎస్ఈ, భారత్ 22లో పెట్టనున్నది. ఆటో క్లెయిం సెటిల్‌మెంట్ పరిమాణాన్ని రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు పెంచింది. గృహాలు, వివాహం, విద్యకు సంబంధించి రుణాలు తీసుకునేవారికి ఇది వర్తించనున్నది.

## 15 వరకు ఐటీ రిటర్న్ గడువు

న్యూఢిల్లీ, నవంబర్ 30: గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నుల గడువు మరో 15 రోజులు పెంచింది కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు. ఈ నిర్ణయంతో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నులు డిసెంబర్ 15 లోపు దాఖలు చేసుకోవచ్చును. ఆదాయ పన్ను చట్టం, 1961కి లోబడి సెక్షన్ 139(1) కింద ఐటీ రిటర్నుల గడువు తేదీని పెంచినట్లు వెల్లడించింది.

## ప్రీమియంలపై జీఎస్టీని ఎత్తివేయండి

- లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

కోల్‌కతా, నవంబర్ 30: బీమా ప్రీమియంలపై జీఎస్టీ ఎత్తివేయాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేస్తున్నది. దీంతోపాటు బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 100 శాతానికి పెంచడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళన చేయనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే బీమా రంగంలో ఎఫ్‌డీఐల పరిమితి 74 శాతంగా ఉన్నదని, మిగతాది కూడా పెంచితే విదేశీ సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరించే అవకాశాలున్నాయని, అందుకోసం దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆల్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఏఐఎన్‌ఎల్ఈ) జనరల్ సెక్రటరీ వీ నరసింహన్ ఈ సందర్భంగా తెలిపారు. దేశవ్యాప్త ఆందోళనకు రాజకీయ పార్టీల మద్దతు కూడబెడుతున్నట్లు చెప్పారు. అలాగే నూతన కార్మిక చట్టం కోడ్‌ను వ్యతిరేకిస్తున్నట్లు, పాత పెన్షన్ స్కీంను తిరిగి పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## టీ కన్సల్ట్ సదస్సులో 117 ఒప్పందాలు

- రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఆవిష్కర్తలతో పెట్టుబడుదారులను కలిపే సహకార సదస్సు-2024లో 117 ఒప్పందాలు కుదరడం అభినందనీయమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రశంసించారు. టీ కన్సల్ట్ సంస్థ ఆధ్వర్యంలో టీ హబ్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల సదస్సును ఆయన శనివారం ప్రారంభించారు. ఆవిష్కర్తలు, పెట్టుబడిదారులను కలిపే ఈ కార్యక్రమం అభివృద్ధికి నూతన మార్గాల అన్వేషణకు సహాయ పడుతున్నదని ఈ సందర్భంగా మంత్రి వ్యాఖ్యానించారు. పాలసీ మేకర్లు, ఆవిష్కర్తలు, పరిశ్రమ నేతలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సదస్సు ఏర్పాటులో తీవ్రంగా శ్రమించిన టీ కన్సల్ట్ సంస్థ వ్యవస్థాపకుడు సందీప్ మక్తాలను మంత్రి అభినందించారు. కొత్త ఒప్పందాలతో పారిశ్రామిక ప్రగతి దూసుకుపోనున్నదని మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు.

శిక్షణ పొందిన అభ్యర్థికి జాబ్ ఆఫర్ లెటర్ అందిస్తున్న ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ క్షితిజ, జీఎం ఆనంద్

## ఉద్యోగాల సాధనకు నైపుణ్యాలు కీలకం

- ఎస్సీ డెవలప్‌మెంట్‌శాఖ కమిషనర్ క్షితిజ

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాల సాధనకు నైపుణ్యాలు కీలకమని ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్, కార్పొరేషన్ ఎండీ క్షితిజ ఉద్బోధించారు. ఎస్సీ కార్పొరేషన్ ఆర్థిక సహకారంతో అనైత్య ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నైపుణ్య శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన దళిత యువతీ యువకులకు సర్టిఫికెట్లతోపాటు జాబ్ ఆఫర్ లెటర్లను అందజేశారు. అనంతరం క్షితిజ మాట్లాడుతూ దళిత యువత కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పేర్కొన్నారు.


మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు